గిరిజనుల ఆరాధ్యదైవం సేవాలాల్ మహారాజు

● మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



గిరిజనులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి,మే 30 : దైవాంశ సంభూతుడు సేవాలాల్ మహారాజ్ అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కొనియాడారు. గురువారం మల్కాజిగిరి, శామీర్‌పేట్ మండలాల్లోని దేవరంజల్ గ్రామం సేవాలాల్ తండాలో నిర్మించిన సేవాలాల్ మహారాజ్ గుడి వార్షిక వేడుకల్లో మాజీ మంత్రి పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా గిరిజనులను చైతన్యం చేస్తూ బ్రిటీష్, నైజం ప్రభుత్వాల వెట్టి చాకిరి నుంచి గిరిజనులను విముక్తులను చేశారన్నారు. నేటి హైదరాబాద్‌లోని బంజారా హిల్స్ సేవాలాల్ గారి కృషి మేరకు ఏర్పాటు చేశారన్నారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత కేసీఆర్ తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలను చేయడంతో గిరిజనులు స్వపరిపాలన సమానత్వం సౌభ్రాతృత్వం సహనం, ఓర్పు, నేర్పు వంటి గుణాలతో సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. గిరిజనులు రాజకీయంగా కూడా ఎదిగి వారి జాతి అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర బీఆర్ఎస్ నాయకురాలు రజనీసాయిచంద్, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



చిన్నరాముడు పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అయిజ రూరల్/ ఉండవెల్లి, మే 30: మండలంలోని దేవబండలో గురువారం గ్రామానికి చెందిన బోయ చిన్నరాముడు మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విజయుడు గ్రామానికి వెళ్లి పార్థివదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి పరామర్శించారు. మృతుడికి భార్య తిరుమలమ్మ, ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. పరామర్శించిన వారిలో నాయకులు నర్సింహా రెడ్డి, రాముడు, దొడ్డెప్ప ఉన్నారు. అలాగే ఉండవెల్లి మండలంలోని మారమునగాల-2కు చెందిన రైతు ఓనూరు బాషా (45) విద్యుదాఘాతంతో మృతిచెందగా.. ఎమ్మెల్యే విజయుడు గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ముగిసిన ఆలయ పాలక మండలి పదవీ కాలం

సన్మానం పొందిన ఆలయ పాలక మండలి సభ్యులు

అలంపూర్, మే 30: జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయ పాలక మండలి పదవీ కాలం మే 30వ తేదీ (గురువారం)తో ముగిసింది. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు ఉభయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పాలక మండలి కమిటీ చైర్మన్ చిన్న కృష్ణయ్యనాయుడు ఆధ్వర్యంలో ధర్మకర్తలు ఏడాదిగా ఆలయ అభివృద్ధి పనుల్లో చురుకుగా పాల్గొన్నారు. ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు ఆలోచనల మేరకు ఆలయంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. పలువురు ప్రముఖులు, భక్తులచే చాలా వరకు ఆలయానికి విరాళాల సేకరించడంలో ఆసక్తి కనబర్చారు. ఈ సందర్భంగా ధర్మకర్తలను ఆలయ సిబ్బంది, అర్చకులు శాలువాలతో సత్కరించి వీడ్కోలు పలికారు.

రోడ్డు పక్కన పడేసిన యూనిఫాం మెటీరియల్

ఉదండాపురం వెళ్లే బీటీ రోడ్డు పక్కన పడిఉన్న మెటీరియల్

ఇటిక్యాల, మే 30: సర్కారు బడుల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు ఉచితంగా అందజేసే ఏకరూప దుస్తుల మెటీరియల్ ఉదండాపురం రోడ్డుపక్కన దర్శనమిస్తున్నాయి. ఉమ్మడి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, బీచుపల్లి గురుకుల, కేజీబీవీకి చెందిన విద్యార్థినులకు దుస్తులను అందించాల్సి ఉంది. దుస్తులను తయారు బాధ్యతను స్వయం సహాయక సంఘాలకు అప్పగించారు. ఉమ్మడి మండలంలోని బీచుపల్లి, షేక్‌పల్లి, ఇటిక్యాల, కొండేర్ నాలుగు క్లస్టర్లు ఏర్పాటు చేశారు. నాలుగు క్లస్టర్లలో దుస్తులు కుట్టేందుకు 50మంది టైలర్లను గుర్తించారు. వీరందరికీ షేక్‌పల్లి క్లస్టర్‌లో వివిధ కొలతలతో గుడ్డలను కత్తిరించిన బండిల్స్‌ను టైలర్లకు అందించే బాధ్యతను మహిళా సమాఖ్య సీసీలకు అప్పగించారు. అయితే ఇటిక్యాల క్లస్టర్‌లోని ఉదండాపురం, వావిలాల పరిధిలో దుస్తులను కుట్టేందుకు అందజేయాల్సిన మెటీరియల్ ఉదండాపురం రోడ్డు పక్కన పడేశారు. వీటిలో దుస్తులకు సంబంధించి చిన్నచిన్న గుడ్డముక్కలు పడి గాలికి చెల్లాచెదురవుతున్నాయి. మొత్తం బండిల్ పడిందా, లేక బండిల్‌లోని చిన్న గుడ్డముక్కలు (కాలర్, జేబులు కుట్టడానికి పనికొచ్చేవి) పడిపోయాయా అనేది తెలాల్సి ఉంది. ఈ విషయమై మహిళా సమాఖ్య ఏపీఎం కుర్మయ్యను సంప్రదించగా.. దుస్తులకు సంబంధించి ఏ చిన్న గుడ్డముక్క పడిపోకూడదని, దుస్తుల మెటీరియల్‌ను షేక్‌పల్లి దగ్గర కత్తిరించి తెస్తున్నామన్నారు. పంపిణీ బాధ్యతను సీసీలకు అప్పగించామన్నారు. దుస్తులు కుట్టేందుకు ప్రతి చిన్నగుడ్డముక్క కుట్టడానికి పనికొచ్చేదే ఎక్కడైనా పడిపోయాయా చెప్పండని అడిగారు.

మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలి

● వనపర్తి కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

చిన్నంబావి, మే 30 : పాఠశాలలు పునర్ ప్రారంభమయ్యేలోగా ఆదర్శ పాఠశాలల్లో కొనసాగుతున్న పనులను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. గురువారం మండలంలోని కొప్పునూరు, వెల్టూరు, చిన్నమారూర్ గ్రామాల్లో అమ్మ ఆదర్శ పాఠశాలకు ఎంపికైన ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని అందులో భాగంగానే ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపిక చేసి అందులో మౌలిక వసతుల కల్పన చేపడుతుందన్నారు. పనుల్లో వేగం పెంచాలని పాఠశాలలు ప్రారంభమయ్యే వరకు పనులు పూర్తై కొత్త రూపును సంతరించుకోవాలన్నారు. అదేవిధంగా జూన్‌లో చేపట్టే బడిబాట కార్యక్రమాన్ని హెచ్ఎంలు, ఉపాధ్యాయులు సన్నద్ధం కావాలని చెప్పారు. కార్యక్రమంలో తాసీల్దార్ ఎం.డీ ఇక్బాల్, ఎంపీడీవో రమణరావు, ఎంపీవో రామస్వామి, అధికారులు పాల్గొన్నారు.

బడులు ప్రారంభమయ్యేలోగా ..

పెబ్బేరు, మే 30 : జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు పునర్ ప్రారంభమయ్యేలోగా మరమ్మతు పనులు పూర్తి చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన పెబ్బేరు మండలం గుమ్మడం, యాపర్ల గ్రామాల్లో పర్యటించి..అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో భాగంగా చేపట్టిన మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇందులో భాగంగానే చేపట్టిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. తాగునీటి వసతి, వంట గది, మరుగుదొడ్లు సహా అన్ని పక్కాగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పనుల నిర్వహణలో ఎక్కడా అలసత్వానికి తావివ్వొద్దని హెచ్చరించారు. యాపర్ల గ్రామంలో రైతులతో మాట్లాడిన కలెక్టర్ ఎరువులు, విత్తనాల విషయంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. వ్యవసాయాధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ మల్లయ్య, తాసీల్దార్ లక్ష్మి, ఎంపీడీవో రవీందర్, ఏఈ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

యాపర్ల లో హైస్కూలు పైకప్పును పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

రైతులకు నాణ్యమైన విత్తనాలనే ఉత్పత్తి చేయాలి

● జోగుళాంబ గద్వాల కలెక్టర్ సంతోష్

గద్వాల, మే 30 : రైతులకు నష్టం జరగకుండా నాణ్యమైన విత్తనాలు ఉత్పత్తి చేయాలని కలెక్టర్ సంతోష్ విత్తన ఉత్పత్తిదారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం విత్తన ఉత్పత్తిదారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా విత్తన ఉత్పత్తిదారులు రైతులకు మేలు జరిగేలా చూడాలన్నారు.జిల్లాలో వివిధ పంటలకు అవసరమైన అనూకూల వాతావరణం ఉన్నందున రైతులకు అధికారులు అవగాహన కల్పించి మేలు రకం విత్తనాలు అందజేయాలన్నారు. ఎస్‌వోపీ ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో డిమాండ్‌కు అనుగుణంగా విత్తనాలు పంపిణీ చేయాలన్నారు. రైతులు నష్టపోకుండా కంపెనీల నుంచి నాణ్యమైన విత్తనాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా అధికారులు మంచి విత్తనాలు అందించే కంపెనీలకు పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో డీఏవో గోవింద్‌నాయక్, సహాయ సంచాలకులు వెంకటలక్ష్మి, సంగీతలక్ష్మి విత్తన ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

జూన్ 2వ తేదీన రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ సంతోష్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అవతరణ వేడుకలు నిరాడంబరంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రజాప్రతినిధులు పాల్గొనే కార్యక్రమాల్లో ఎలాంటి రాజకీయ ప్రసంగాలు లేకుండా తమ కార్యాలయాల వద్ద అవతరణ వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని కార్యాలయాల్లో ఉదయం 8:30గంటల వరకు పతావిష్కరణలు నిర్వహించుకొని జిల్లా అధికారులు అందరూ ఉదయం 9గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహించే పతావిష్కరణలో పాల్గొనాలని సూచించారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఉద్యమకారులను స్మరించుకోవడం చాలా ముఖ్యమని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అపూర్వచౌహాన్, వెంకటేశ్వర్లు, ఆర్డీవో రామచందర్, అధికారులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

ఆరోగ్య సేవలపై అవగాహన సదస్సు

అవగాహన సమీక్షలో పాల్గొన్న డీఎంహెచ్‌వో

వనపర్తి, మే 30 : జిల్లాలోని వైద్యారోగ్యశాఖలోని సబ్ సెంటర్ స్థాయి నుంచి జిల్లా దవాఖానలో ఓడీకే యాప్ ద్వారా అందుతున్న ఆరోగ్య సేవల పై డీఎంహెచ్‌వో జయచంద్రమోహన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న వైద్యాధికారులందరూ దీనిపై అవగాహన కల్గిండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉపవైద్యారోగ్యశాఖ అధికారి శ్రీనివాసులు, ప్రోగ్రాం అధికారులు మంజుల, పరిమళ పాల్గొన్నారు.

దవాఖానల్లో కాన్పుల సంఖ్య పెంచాలి

పాన్‌గల్, మే 30:ప్రభుత్వ దవాఖానల్లో కాన్పుల సంఖ్య పెంచాలని వైద్యాధికారి నాగరాజు, సీహెచ్‌వో రామయ్య అన్నారు. గురువారం పీహెచ్‌సీలో ఏఎన్ ఎంలు, ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో గర్భిణులను గుర్తించి, అర్హత కలిగిన వైద్యులతో వైద్యసేవలందించే బాధ్యత ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలపై ఉందన్నారు. ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు, వ్యాధినిరోధక టీకాలు తదితర జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. క్షయ వ్యాధిగ్రస్తులుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. వర్షాకాలంలో వచ్చే మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, ఫైలేరియా, మెదడు వాపు తదితర వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సమావేశంలో వైద్య సిబ్బంది ఉన్నారు.

మాతా శిశుసంరక్షణ సేవలు అందించాలి

గద్వాలటౌన్, మే 30 : గర్భిణులు, బాలింతలు, శిశువులకు తప్పనిసరి మాతా శిశుసంరక్షణ సేవలు అందించాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో శశికళ సూచించారు. జిల్లా కేంద్రంలోని బస్తీదవాఖానలో గురువారం ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెల్త్ అండ్ వెల్‌నెస్ పరిధిలోని ప్రజలందరికీ అన్ని రకాల ఆరోగ్య సేవలు అందించాలని సూచించారు. శుక్రవారం డ్రై డే నిర్వహించాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సిద్దప్ప, డాక్టర్ రాజు, వైద్యాధికారులు మధుసూదన్‌రెడ్డి, నరేంద్రబాబు, మాధవి, రామాంజనేయులు, సాధిక్, రాజ్‌కుమార్, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

భైరాపురంలో వైద్య శిబిరం

ఉండవెల్లి, మే 30: మండలంలోని భైరాపురంలో భవిష్య భారత్, వీఎస్టీ కేర్ లిమిటెడ్, వీఎస్టీ సంజీవని ఆధ్వర్యంలో గురువారం ఆర్థోపెడిక్ ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 250మందికి ఆర్థోపెడిక్ ఓపీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్థోపెడిక్ డాక్టర్ సుబ్బారెడ్డి, వీఎస్టీ సంజీవని డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజర్ నాగరాజు, మెడికల్ ఆఫీసర్ సురేశ్‌కుమార్, ఎంపీహెచ్ఈఏ లక్ష్మీకాంత్, వైద్య సిబ్బంది హరిప్రసాద్, రమ్య, నిరంజన్, రాజు, హాజీ, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి అందుబాటులో గ్రూప్-1 హాల్‌టికెట్లు

● అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

వనపర్తి, మే 30 : గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్స్ జూన్ 1 వతేదీ నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షల నిర్వహణ సన్నద్ధతపై అధికారులతో వెబ్‌ఎక్స్ మీటింగ్‌ను అదనపు కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సందేహాలు, సమస్యలు పరిష్కరించేందుకు జూన్ 8, 9 తేదీల్లో ప్రత్యేక హెల్ప్ డెస్క్ నెంబర్ 08545-233525ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జూన్ 9 తేదీన పరీక్షకు అభ్యర్థులు నిమిషం ఆలస్యంగా వచ్చినా పరిక్షా కేంద్రంలోకి అనుమతి లేదన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్, వాచ్, ఆభరణాలు, పరీక్షా ప్యాడ్, లూజ్ పేపర్లు, బ్యాగ్, లాగార్థం బుక్, చార్ట్, బూట్లు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి లేవని తెలిపారు. జిల్లాలో 4,843మంది అభ్యర్థులు గ్రూప్-1ప్రిలిమినరీ పరీక్ష రాయనున్నారని వీరి కోసం 17 పరీక్షా కేంద్రాలను ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు అమర్చాలని సూచించారు. పరీక్షా కేంద్రం పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేసి జిరాక్స్ కేంద్రాల మూసివేయించాల న్నారు. అభ్యర్థులు ఉదయం 10గంటల లోగా కేంద్రాన్ని చేరుకోవాలన్నారు. ఉదయం 8నుంచి 9.30 గంటల వరకు ఆర్టీసీ బస్సులు రూట్ వారీగా నడపాలని, అభ్యర్థులను పకడ్బందీగా చెక్ చేయడానికి పోలీసులకు సహకారం అందించాలన్నారు.

దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

జూన్ 2వ తేదీన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అదనపు రెవెన్యూ కలెక్టర్ నగేశ్ అధికారులకు సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులకు అప్పగించిన బాధ్యతలు నిబద్ధతతో పూర్తి చేయాలని ఏర్పాట్లలో ఎలాంటి లోటు లేకుండా చూసుకోవాలన్నారు.

కౌంటింగ్‌లో పాల్గొనే సిబ్బందికి శిక్షణ

జూన్ 4న నాగర్‌కర్నూల్ జిల్లాలోని మార్కెట్ యార్డులో జరిగే పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపులో విధులు కేటాయించిన ఉద్యోగులు తమ బాధ్యతలను జాగ్రత్తగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ ఎం.నగేష్ తాసీల్దార్లు, ఉప తాసీల్దార్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లో కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ , సలహాలు, సూచనలు చేశారు. అప్పగించిన బాధ్యతలు నిబద్ధతతో పూర్తి చేయాలని అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ నోడల్ అధికారి డీఎస్పీ కృష్ణ కిశోర్, రీజినల్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, తాసీల్దార్ కిషన్‌నాయక్, వెబ్‌ఎక్స్ ద్వారా ఇతర జిల్లా అధికారులు, ఆర్డీవో పద్మావతి, తాసీల్దార్ రమేశ్‌రెడ్డి, పాండునాయక్, శ్రీనివాస్, మదన్‌మోహన్, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.

పనుల్లో వేగం పెంచాలి

కొత్తకోట, మే 30 : అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో వేగం పెంచాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ సూచించారు. గురువారం మండలంలోని ఈదులబాయితండా, సంకిరెడ్డిపల్లి, కొత్తకోట, రామనంతాపురం గ్రామాల్లోని పాఠశాలల్లో మరమ్మతులు పనులను ఆయన పరిశీలించారు. వచ్చే నెల 8వ తేదీలోగా పెండింగ్ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో రవీంద్రబాబు, ఎంఈవో కృష్ణయ్య, పంచాయతీ రాజ్ ఏఈ షబ్బీర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

కుట్టు పనులను వేగవంతం చేయాలి

● డీఆర్‌డీవో నర్సింగరావు

గట్టు, మే 30 : యూనిఫాం కుట్టు పనులను వేగవంతం చేయాలని డీఆర్‌డీవో నర్సింగరావు స్పష్టంచేశారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయంతో పాటు మహిళా కుట్టు కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కుట్టే విధానాన్ని పరిశీలించారు. పాఠశాలల ప్రారంభానికి ముందే యూనిఫాంలు పాఠశాలలకు అందేవిధంగా చూడాలని స్పష్టంచేశారు. కార్యక్రమంలో ఏపీఎం సాంబశివుడు, సీసీలు జయకర్, ఆంజనేయులు, జ్యోతి, వీవోఏలు పాల్గొన్నారు.

అంబేద్కర్‌ను దూషించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

ఆత్మకూరు, మే 30 : బీఆర్ అంబేద్కర్‌ను దూషించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ మండల యువజన సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. మండలంలోని ఆరెపల్లి వాట్సాప్ గ్రూపులో రిజర్వేషన్లపై చర్చ కొనసాగిస్తూ టి.వేణు అంబేద్కర్‌ను అసభ్య పదజాలంతో దూషించాడు. రిజర్వేషన్లు కల్పించడాన్ని వ్యతిరేకిస్తూ అంబేద్కర్‌ను అసభ్య పదజాలంతో దూషించాడు. దీనిని ఖండించిన అంబేద్కర్ యువజన సంఘం ప్రతినిధులు వేణుపై గురువారం మండల యువజన సంఘం నాయకులతో కలిసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వేణుపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సీఐ శివకుమార్, ఎస్సై నరేందర్, తాసీల్దార్ రాజుకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మండలంలోని అంబేద్కర్ యువజన సంఘాల ప్రతినిధులు, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

సన్మానం, ప్రశంసలు అందుకుంటున్న నాయకంటి నరసింహాశర్మ

వనపర్తి కవికి సన్మానం

వనపర్తి టౌన్, మే 30: వనపర్తి కవి డాక్టర్ నాయకంటి నరసింహాశర్మకు నాగయ్య సాహితీ పీఠం వారితో ఘన సన్మానం, ప్రశంసలు లభించాయి. సురవరం ప్రతాపరెడ్డి జయంతిని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కవి సమ్మేళనంలో నాయకంటి నరసింహా శర్మ పాల్గొన్నారు. పాలడుగుల నాగయ్య సాహితీ పీఠం, తెలుగు చైతన్య సమితి వారు ప్రశంసాపత్రంతో పాటు సన్మానించారన్నారు. సన్మానించిన వారిలో విశ్రాంత అచార్యులు డాక్టర్ సబ్బిరెడ్డి వెంకట్‌రెడ్డి, కళా పీఠం అధ్యక్షుడు డాక్టర్ రాధాకుసుమ, తెలంగాణ రాష్ట్ర స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ సరోజిని ఉన్నారు.

హత్య చేసిన దుండగులు ఎక్కడ..?

● వారం రోజులైనా ఆచూకీ లేదు

● విలేకరుల సమావేశంలో ఎంపీపీ, జెడ్పీటీసీ

చిన్నంబావి, మే 30 : మండలంలోని లక్ష్మీపల్లి గ్రామానికి చెందిన కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ప్రధాన అనుచరుడు బొడ్డు శ్రీధర్‌రెడ్డిని హత్య చేసిన దుండగులు ఎక్కడ ఉన్నారు.. ఇంకా ఎందుకు పట్టుకోలేదని ఎంపీపీ సోమేశ్వరమ్మ, జెడ్పీటీసీ వెంకట్రామమ్మ మండిపడ్డారు. గురువారం మండలకేంద్రంలోని జెడ్పీటీసీ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. శ్రీధర్‌రెడ్డి హత్య జరిగి వారం రోజులైనా ఇప్పటి వరకు దుండగులను గుర్తించలేకపోవడం ఎంతో సిగ్గుచేటన్నారు. గత కేసీఆర్ పాలనలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా కొల్లాపూర్ నియోజకవర్గంలో చిన్నంబావి మండలం సస్యశ్యామలంగా, శాంతియుతంగా ఉంటూ అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లామన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఆరునెలలు గడవకముందే హత్యలు, దాడులు జరుగుతుంటే పట్టించుకోకపోవడం దారుణమన్నారు. శ్రీధర్‌రెడ్డిపై చేసే ఆరోపణలు తీవ్రంగా ఖండిస్తున్నామని, మీ ప్రభుత్వమే అధికారంలో ఉంది కదా ఎందుకు హంతకులను పట్టుకోలేకపోతున్నారని ప్రశ్నించారు. దుండగులను పట్టుకోలేకపోతే రాజీనామా చేయండని మండిపడ్డారు. హత్య చేసిన దుండగులను తక్షణమే పట్టుకోకపోతే రాష్ట్రస్థాయిలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు.అదేవిధంగా నాలుగు రోజుల కిందట పెద్దదగడ గ్రామంలోని మంత్రి జూపల్లి నివాసంలో కాంగ్రెస్ నాయకులు ఈ హత్య గ్రూపు రాజకీయాలు, లావాదేవీల వల్లనే అని మాపై తోయడం సిగ్గుచేటన్నారు. మీరు చేసిన ఆరోపణలకు ఏమైనా సాక్షాలు ఉండే రుజువు చేయాలని డిమాండ్ చేశారు. పోలీస్ శాఖపై మాకు ఎంతో నమ్మకం, గౌరవం ఉందని నిజాయితీగా విచారణ జరిపి హత్య చేసిన దుండగులు శిక్ష పడే విధంగా కృషి చేయాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గోవింద్ శ్రీధర్‌రెడ్డి, చిన్నారెడ్డి, పల్లె మద్దిలేటి, రాజురెడ్డి, శివారెడ్డి, రామస్వామి, డేగ శేఖర్, ఉగ్ర నర్సింహ, ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు

● జిల్లా వ్యవసాయాధికారి చంద్రశేఖర్

ఖిల్లాఘణపురం, మే 30 : రైతులకు నకిలీ ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండలకేంద్రంతో పాటు మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. ముందుగా దుకాణాల్లోని రికార్డులు, ఎరువులు, విత్తనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను మాత్రమే విక్రయించాలని, రైతులు కొనుగోలు చేసిన వాటికి కచ్చితంగా రసీదులను ఇవ్వాలన్నారు. రైతులు కొనుగోలు చేసిన వాటికి రసీదులను తీసుకొని జాగ్రత్తగా పెట్టుకోవాలన్నారు.ప్రభుత్వ నిబంధనల మేరకే ఎరువులు, విత్తనాలు విక్రయించాలని, నకిలీ ఎరువులు, విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని దుకాణ యజమానులకు ఆయన సూచించారు. వానకాలం పంటలకు కావాల్సిన విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఏవో మల్లయ్య, ఏఈవోలు తదితరులు ఉన్నారు.

విత్తనాల ఎంపికపై రైతులకు అవగాహన

గోపాల్‌పేట, మే 30 : రేవల్లి మండలంలోని నాగపూర్‌లో గురువారం నాణ్యమైన విత్తనాల కొనుగోలుపై రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏవో అధికారి అనిల్‌కుమార్ రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రైతులు విత్తనాలను వ్యవసాయశాఖ అనుమతి పొందిన డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలన్నారు. విత్తనాల సంచులపై లేబుల్ నిర్ధారణ పట్టిక, బ్యాచ్, లాట్ సంఖ్యలు, ధర, విత్తనం గడువు తేదీ ఉన్నాయో లేదో గమనించాలన్నారు